- కొన్నిచోట్ల పగలూ వెలుగులు
- పలు ప్రాంతాల్లో రాత్రుళ్లు అంధకారం
- విద్యుత్ వృథాను పట్టించుకోని అధికారులు

ఎందుకింత నిర్లక్ష్యం..?



పాల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయం ఎదురుగా పగలు వెలుగుతున్న వీధి దీపాలు



జీవీఎంసీ 51వ వార్డు ఉడా కమ్యూనిటీ హాల్ పక్కన పగలు వెలుగుతున్న హైమాస్ట్ లైట్లు



50వ వార్డు పేస్ట్రీ చెఫ్ పక్కన పగలు వెలుగుతున్న లైటు

మద్దిపాలెం :

అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎంతో విలువైన విద్యుత్ వృథా అవుతోందని స్థానికులు మండిపడుతున్నారు. మరోవైపు కొన్నిచోట్ల పగటి వేళ విద్యుత్ దీపాలు వెలుగుతూనే ఉంటున్నాయని... అవసరమైన చోట రాత్రి వేళ వెలగకపోవడంతో అంధకారం నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో విద్యుత్‌శాఖ అధికారులు పర్యవేక్షించకపోవడం, వీధి దీపాల నిర్వహణ విభాగం సిబ్బంది పట్టించుకోకపోవడం వల్లే విద్యుత్ వృథాతోపాటు వార్డుల్లో అంధకారం నెలకొంటోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చీకట్లో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు

జీవీఎంసీ 49, 50, 51వ వార్డుల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. 49వ వార్డు ఎన్‌జీవోస్ కాలనీ, అయ్యప్పనగర్ బస్టాప్ వెనుక, మురళీనగర్ మసీద్ జంక్షన్, అపోలో ఫార్మసీ సందులో ఉన్న విద్యుత్ స్తంభాలకు లైట్లు వెలగడం లేదు. ఇలా పలు చోట్ల రాత్రి వేళ వీధి దీపాలు వెలగడం లేదు. మరో పక్క మాధవధారలో పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతూనే ఉంటున్నాయి. అసలే ఎండా కాలం ప్రారంభమైంది.., ఎప్పుడు విద్యుత్ సరఫరా ఉంటుందో, ఎప్పుడు నిలిపేస్తారో తెలియని పరిస్థితుల్లో విద్యుత్ వృథా చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదా చేయాల్సిన అధికారులు పట్ట పగలు వీధి దీపాలు వెలుగుతుంటే పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. మరి కొన్ని చోట్ల రాత్రి వేళల్లో చిమ్మచీకటి నెలకొనడంతో రాకపోకలు సాగించేందుకు స్థానికులు బిక్కుబిక్కుమంటున్నారు.







విజేత సూపర్ మార్కెట్ వద్ద పగలు లైటు

49వ వార్డు భారతి గ్రాండ్ ఎదురుగా వెలగని లైటు



51వ వార్డు టీడీపీ కార్యాలయం ఎదురుగా పగలు వెలుగుతున్న హైమాస్ట్ లైట్లు

అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే...

జీవీఎంసీ 50, 51వ వార్డు పరిధి మాధవధార మెయిన్ రోడ్డులో పాల్యూషన్ కంట్రోల్ బోర్డు, పాత ఈడీ ఆఫీస్, విజేత సూపర్ మార్కెట్ వద్ద వరుసగా వీధి దీపాలు , ఉడా కమ్యూనిటీ హాల్ పక్కన హైమాస్ట్ లైట్లు, అలాగే టీడీపీ మాజీ కార్పొరేటర్ కార్యాలయం వీధిలో లైట్లు, అక్కడికి సమీపంలో ఉన్న హైమాస్క్ లైట్లు, కార్యాలయం ఎదురుగా ఉన్న వీధి లైటు, మాధవధార జంక్షన్ 48వ నంబరు బస్టాప్ వద్ద, మురళీనగర్ పేస్ట్రీ చెఫ్ పక్కన.... పగలు కూడా నిత్యం వీధి లైట్లు వెలుగుతూ దర్శనమిస్తున్నాయి. సిబ్బంది క్షేత్ర స్థాయిలో పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ దుస్థితి నెలకొందని ఈ రెండు వార్డుల ప్రజలు వాపోతున్నారు. ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదని, కావాల్సిన సమయంలో లైట్లు పనిచేయడం లేదని, పగటి వేళ మాత్రం వెలుగుతున్నాయని మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మొద్దు నిద్ర వీడాలని, అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. మాధవధార వుడా కాలనీ నుంచి అటు మాధవధార, మురళీనగర్ వరకు చాలా చోట్ల లైట్లు వెలుగుతునే ఉంటున్నాయి. అధికారులు క్షేత్రస్థాయిలో సత్వరమే స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో ప్రాధాన్యం



బానాల శ్రీనివాసరావు | అల్లు శంకరరావు | కె.అనిల్ కుమార్ రాజు | కొణతాల రేవతీరావు
బుడుమూరు తిరుమల రావు | వెంపాడ నూకరాజు | కంచుమర్తి శేఖర్ | మంచా నాగమల్లీశ్వరి

సీతంపేట : వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా కమిటీ ఏర్పాటైంది. పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ జిల్లా కమిటీలో వివిధ హోదాలలో ఉత్తర నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. పార్టీ విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడిగా జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు, కోశాధికారిగా 14వ వార్డు కార్పొరేటర్ కటారి అనిల్ కుమార్ రాజు, ఆర్గనైజేషనల్ సెక్రటరీలుగా 26వ వార్డుకు చెందిన కొణతాల రేవతీరావు, 51వ వార్డుకు చెందిన బుడుమూరు తిరుమల రావు, యాక్టివిటీ సెక్రటరీలుగా 25వ వార్డుకు చెందిన వెంపాడ నూకరాజు, కంచుమర్తి శేఖర్, అఫీషియల్ స్పోక్స్ పర్సన్‌గా డాక్టర్ మంచా నాగమల్లీశ్వరి నియమితులయ్యారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

మద్దిపాలెం : ఇటీవల కాలంలో జరుగుతున్న సైబర్ నేరాలపై కంచరపాలెం క్రైం పోలీసులు విద్యార్థులకు జిల్లా కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్రైం సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ సైబర్ క్రైం, ఆన్‌లైన్ మోసాలు, సెల్‌ఫోన్లు, బైక్‌లు, బంగారం, వెండి వంటి దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని, యువత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. చదువుపై దృష్టి సారించాలన్నారు. రాత్రి వేళల్లో సెల్‌ఫోన్లు మాట్లాడుతూ ఒంటరిగా వెళ్లకూడదని, బైక్‌లను సురక్షితమైన ప్రాంతాల్లో పార్కింగ్ చేసి, జాగ్రత్తగా తాళాలు వేయాలన్నారు. బంగారం, వెండి ఆభరణాలు జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. ప్రేమ వ్యవహారాల జోలికి పోకూడదని, అఘాయిత్యాలకు పాల్పడకుండా ఉండాలని సూచించారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాలేజీ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న క్రైం సీఐ శ్రీనివాస్

చురుగ్గా మంచినీటి పథకం పనులు

సీతమ్మధార : కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేసిన అమృత 2.0 పథకం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సీతమ్మధార హిల్ పార్కు నుంచి పనులు జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.48 కోట్లతో 24/7 తాగునీరు అందించేందుకు పనులు చేపట్టిన విషయం తెలిసిందే. జీవీఎంసీ పరిధిలోని 14, 23, 24, 43వ వార్డుల్లో 7760 ఇళ్లకు, 99 వేల మందికి మంచినీరు నిరంతరం అందేవిధంగా జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. పనులు పూర్తయితే నాలుగు వార్డుల్లో ప్రజల దాహం తీరుతుంది. ఇప్పటి వరకు 14వ వార్డులోని పలు ప్రాంతాల్లో 80 శాతం పైప్‌లైన్ పనులు పూర్తి చేశారు. ప్రసుత్తం 24వ వార్డులో పైప్‌లైన్ ఏర్పాటు కోసం గోతులు తవ్వుతున్నారు. 14వ వార్డులోని బాలయ్య శాస్త్రి లే అవుట్, నార్త్ ఎక్స్‌టెన్సన్, రాధాకృష్ణ లే అవుట్, పోర్టు స్టేడియం ఈస్టు గేటు, తదితర ప్రాంతాల్లో పనులు జరుగుతున్నాయి. అయితే గోతులు తవ్వి మట్టి వదిలేయడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. త్వరగా మట్టి పూడ్చేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



పైప్‌లైన్ కోసం తవ్విన ప్రదేశం

గ్లోబల్ వార్మింగ్‌తో ప్రమాదం

కంచరపాలెం : వాతావరణంలో వేడి పెరిగిపోవడం మానవాళికి ఓ హెచ్చరిక అని నన్నయ్య యూనివర్సిటీ విశ్రాంత ఉప కులపతి డాక్టర్ సుంకరి రామకృష్ణారావు అన్నారు. జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కె.మాణిక్యకుమారి, వ్యూస్ సంస్థ కో – ఆర్డినేటర్ రాజేశ్వరి నేతృత్వంలో ఆస్ట్రేలియన్ కాన్సలేట్ జనరల్ సంస్థతో నిర్వహించిన యూత్ ఏక్షన్ ఫర్ క్లైమేట్ ఛేంజ్ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, భూమి మీద మాత్రమే జీవి మనుగడ సాగిస్తోందని వివరించారు. శీతోష్ణస్థితి వేడెక్కకుండా యువత పూర్తి స్థాయిలో కృషి చేయాలని కోరారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వాతావరణ విభాగం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ ఒ.భానుకుమార్ మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్ వల్ల కలిగే ఉపద్రవాలపై ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విపత్తులు సంభవించక ముందే కర్బన ఉద్గారాలను తగ్గించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ హేమ, డాక్టర్ పి.కె.జయలక్ష్మి, డాక్టర్ ఎం.పద్మ, హాని, దివ్య, జీవీ రత్నం, డాక్టర్ హరిణి, డాక్టర్ వీరబ్రహ్మం, డాక్టర్ స్నేహ, డాక్టర్ మౌసమి, శంకర్, డాక్టర్ శ్రీను, డాక్టర్ పద్మాసుందరి, ఊర్మిళ, రంజిత పాల్గొన్నారు.



విద్యార్థులతో అతిథులు, అధ్యాపకులు

ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతతో మెలగాలి

సీతమ్మధార : ప్రభుత్వ సంస్థల ఉద్యోగులు బాధ్యతతో పనిచేయాలని సంఘమిత్ర సోషల్ సర్వీస్ వ్యవస్థాపకుడు సంఘమిత్ర సూరిబాబు అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గురువారం ఆయన ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణకు గల కారణాలపై అవగాహన ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులందరూ ఒక చిన్న తప్పు చేయడం వల్ల మంచి వారందరూ బాధ్యతగా పనిచేసినా ప్రయోజనం ఉండడం లేదన్నారు. కొందరు ప్రభుత్వ ఉద్యోగులు పని చేయకుండా, అప్పుడప్పుడు వచ్చి పూర్తి జీతం తీసుకోవడం వల్ల ఆయా వ్యవస్థలు పూర్తిగా విచ్ఛిన్నం అవుతున్నాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ రమాదేవి, ప్రజా గాయకులు దేవిశ్రీ,, సంఘమిత్ర సోషల్ సర్వీసెస్ నిర్వాహకులు, మహిళలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సంఘమిత్ర సూరిబాబు

దివ్యాంగుల గుర్తింపునకు సర్వే

మహారాణిపేట : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పెయిందొర పేటలో గురువారం ఇంటింటికీ వెళ్లి దివ్యాంగులను గుర్తించారు. పెయిందొర పేట, కేజీహెచ్, జాలారిపేట తదితర ప్రాంతాల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ మాట్లాడుతూ సర్వే ఈ నెల 24 వరకు సాగుతుందన్నారు. ఎక్కడైనా దివ్యాంగ పిల్లలను గుర్తిస్తే సమాచారమివ్వాలని కోరారు.

క్లుప్తంగా

పద్యనాటక ప్రదర్శన నేడు

మురళీనగర్ : సాయి కళానికేతన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మాధవధార మాధవ సమాజం భవనంలో భక్త ప్రహ్లాద పద్యనాటకం శుక్రవారం ప్రదర్శిస్తారని సొసైటీ అధ్యక్షుడు చౌదరి అప్పారావు తెలిపారు. ఈ మేరకు ఆ రోజు సాయంత్రం నంది అవార్డు గ్రహీత బగాది విజయసారథి హిరణ్య కశిపుడిగా, ప్రహ్లాదుడిగా చిరంజీవి జాహ్నవి లక్ష్మీదేవి నటిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా ప్రముఖ రంగస్థల నటుడు మెడికల్ డిపార్టుమెంటు చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ ఓలేటి శంకర్‌ను సత్కరిస్తామని తెలిపారు.

బానాలకు అభినందనలు



బానాల శ్రీనివాసరావును అభినందిస్తున్న బానాల యువసేన ప్రతినిధులు

సీతంపేట : జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా బానాల యువసేన ప్రతినిధులు గురువారం ఆయన ఇంటికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. పార్టీకి పూర్వవైభవం తేవడానికి తన వంతు కృషి చేస్తానని బానాల తెలిపారు. కార్యక్రమంలో గని, వెంకటరావు, పిడుగు వెంకట్, బాధ శ్రీనివాస్, మహాదాస్యం గోపి, జేమ్స్, యుగంధర్, మణికంఠ, ముత్యాలరావు, ప్రసాద్, బానాల యువసేన కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ ఇంటింటా ప్రచారం

మురళీనగర్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పాకలపాటి రఘు వర్మకు మద్దతుగా ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (257) ప్రతినిధులు ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. మురళీనగర్, మాధవధార పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ఉపాధ్యాయ, అధ్యాపక ఓటర్ల ఇంటికి వెళ్లి రఘు వర్మకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. ఓటర్లకు వారి ఓటు, పోలింగ్ స్టేషన్ అడ్రస్, పోలింగ్ స్టేషన్ నంబర్లతో కూడిన స్లిప్‌లను గురువారం అందించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొటాన శ్రీను, పూర్వ కార్యదర్శి బి.వెంకటపతి రాజు ఆధ్వర్యంలో జిల్లా నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు.

ఔషధాల తయారీలో జాగ్రత్తలు అవసరం

మురళీనగర్ : వైద్య రంగంలో ఔషధాల తయారీలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు సూచించారు. స్థానిక కాలేజీలో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, లైఫ్ సైన్సెస్ సెక్టార్ స్కిల్ డవలప్‌మెంట్ కౌన్సిల్ సహకారంతో రిజిస్టర్డ్ ఫార్మాసిస్టులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా ఔషధాల వినియోగంలో వాటి ప్రతి చర్యలపై ప్రతి ఫార్మాసిస్టుకు అవగాహన ఉండాలన్నారు. కృత్రిమ మేధను అవగాహన చేసుకోవాలన్నారు. పాలిటెక్నిక్‌లోని ఫార్మసీ కాలేజీ అధ్యాపకుడు జి.సాయిరాజేష్ 40 మంది ఫార్మాసిస్టులకు శిక్షణ ఇచ్చారు. ఫార్మా కోవిజిలెన్స్ కేస్ ప్రాసెసింగు విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఫార్మసీ కౌన్సిల్ సభ్యుడు విలియం కేరీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నారాయణరావు

20 కార్ల అద్దాలు ధ్వంసం

సీతమ్మధార : మానసిక వ్యాధితో బాధపడుతున్న ఒక వ్యక్తి సుమారు 20 కార్ల అద్దాలు ధ్వంసం చేసిన ఘటన సీతమ్మధారలో చోటు చేసుకుంది. గురువారం మధ్యాహ్నం సీతమ్మధార, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వెనుక రోడ్డు ప్రాంతంలో సుమారు 20 కార్ల అద్దాలను రాళ్లతో ధ్వంసం చేశాడు. వెంటనే ఆ వ్యక్తిని స్థానికులు ద్వారకా పోలీస్ స్టేషన్‌కు తరలించగా వారిపై చిందులు వేశాడు. పేరు అడిగితే వెంకటరమణ అని, నక్కవానిపాలెంలో ఉంటున్నట్లు పోలీసులకు తెలిపాడు. మరోవైపు బుధవారం రాత్రి ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు కార్ల అద్దాలు ధ్వంసం చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. వెంకటరమణకు తల్లి, భార్య ఉన్నారు. శ్రీకాకుళం జిల్లా, పలాసకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఆయనను పెద్దవాల్తేరులోని మానసిక ఆస్పత్రికి తరలించారు.

కొరవడిన పోలీసుల గస్తీ

సీతమ్మధార ప్రాంతంలో పోలీసుల గస్తీ కొరవడడంతో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అల్లరిమూకలు రెచ్చిపోతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముందస్తుగా చర్యలు తీసుకోవడంలో పోలీసులు విఫలమైతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. గంజాయి, మద్యం మత్తులో పలువురు దాడులకు పాల్పడుతూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నా కనీస చర్యలు శూన్యం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి బందోబస్తు పెంచాలని, ఏరియా బీటులు పెంచాలని స్థానికులు కోరుతున్నారు.



కార్ల అద్దాలు ధ్వంసం చేసిన వ్యక్తి



సీతమ్మధారలో ధ్వంసమైన కారు

చిరు వ్యాపారులను తొలగించడం దుర్మార్గం

సీతమ్మధార : పూర్ణా మార్కెట్ రోడ్డు మార్జిన్‌లో జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అండగా నిలవాలని జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఉదయం చిరు వ్యాపారులు జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పూర్ణా మార్కెట్ వద్ద రోడ్లపై గంపలు, తోపుడుబండ్లపై పండ్లు, పువ్వులు వగైరా వ్యాపారాలు చేస్తున్న చిరు వ్యాపారులను పోలీసులు అక్కడి నుంచి పూర్తిగా తొలగించడం దుర్మార్గమన్నారు. పూర్ణా మార్కెట్ జీవీఎంసీ ఆధీనంలో ఉందని, అటువంటప్పుడు అక్కడి వ్యాపారులపై ఏదైనా నిర్ణయం తీసుకోవాలంటే కౌన్సిల్‌లో తీర్మానం చేయాల్సి ఉంటుందన్నారు. అటువంటిది ఏమీ లేకుండా పోలీసులు జోక్యం దేనికని ఆయన ప్రశ్నించారు. చిరు వ్యాపారులను అక్కడి నుంచి తొలగించాలంటే, అదే ప్రాంతంలో ప్రత్యామ్నాయ స్థలాన్ని వారికి కేటాయించాలని, వెండర్ జోన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. చిరు వ్యాపారులను కొండలు, భూములు ఆక్రమణదారులుగా, దొంగలుగా భావించడం సరికాదన్నారు. పేదల పక్షాన ఉంటానని హామీ ఇచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా వచ్చినప్పటి నుంచి చిరు వ్యాపారులపై దాడులు పెరిగాయని సీపీఎం జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు ఆరోపించారు. చిరు వ్యాపారులకు న్యాయం చేయాలని నగర పోలీస్ కమిషనర్‌కు, జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రాలు సమర్పించామని, నేడు జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందించామని తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో చిరు వ్యాపారులు పాల్గొన్నారు.



జీవీఎంసీ ప్రధాన గేటు వద్ద ధర్నా చేస్తున్న చిరు వ్యాపారులు

8న జాతీయ లోక్ అదాలత్

మహారాణిపేట : మార్చి 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌కు ఎక్కువ కేసులు వచ్చేలా వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ సూచించారు. గురువారం జిల్లా కోర్టులో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రజా న్యాయపీఠం అధ్యక్షుడు వల్లభ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలి



కేకేరాజుని సత్కరిస్తున్న బాణాల శ్రీనివాసరావు, అల్లు శంకరరావు, కె.అనిల్ కుమార్‌రాజు

సీతమ్మధార : వైఎస్సార్ సీపీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని ఆ పార్టీ విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్ క్యాప్ మాజీ చైర్మన్ కె.కె.రాజు పిలుపునిచ్చారు. పార్టీ విశాఖపట్నం జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా బాణాల శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీగా అల్లు శంకరరావు, ట్రెజరర్‌గా కె.అనిల్ కుమార్ నియమితులైన సందర్భంగా సీతమ్మధారలోని కార్యాలయంలో కేకే రాజుని మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు అందరం కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కుటుంబాల చెంతకు యువకులు



కుటుంబ సభ్యులకు అప్పగించిన వారితో శ్రద్ధా ఫౌండేషన్ ప్రతినిధులు

సీతమ్మధార : ఇద్దరు బిహార్ యువకులను ఏయూటీడీ సంస్థ ఆధ్వర్యంలో శ్రద్ధా ఫౌండేషన్ వారి ఇళ్లకు చేర్చింది. ఈ సందర్భంగా ఏయూటీడీ కార్యదర్శి ప్రగాడ వాసు మాట్లాడుతూ బిహార్‌లోని పర్సానీ గ్రామానికి చెందిన బికాస్ కుమార్ (20) తల్లి చనిపోవడంతో చలించిపోయి ఇల్లు వదిలి వచ్చేశాడు. రెండో వ్యక్తి బిహార్‌లోని బోథ్ గయకు చెందిన రాందరీ మంజీ (38) అలియాస్ సుందర్ 8 సంవత్సరాల నుంచి మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. పేదరికం వల్ల మందులు వేసుకోకపోవడంతో వ్యాధి ముదిరి రోడ్డు పాలయ్యాడు. ఏయూటీడీ వీరికి వైజాగ్‌లో ఆశ్రయం కల్పించి వైద్యం అందించి క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలి

డాబాగార్డెన్స్ : విద్యకు, విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలని, ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎంఎన్ హరేందిరప్రసాద్ ఆదేశించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను, సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యార్థినుల వసతి గృహాన్ని గురువారం ఆయన సందర్శించారు. అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలని, క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికయ్యే విధంగా సిద్ధం చేయాలని సూచించారు. వసతి గృహంలో ఉండే విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించాలన్నారు. అనంతరం కృష్ణా కళాశాలను సందర్శించి అక్కడి పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కృష్ణానగర్ ఏరియాలో గల మలేరియా నియంత్రణ కార్యాలయాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులు గమనించారు. పర్యటనలో కలెక్టర్ వెంట సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, ఇతర అధికారులు ఉన్నారు.



ప్రిన్సిపాల్ మంజులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిరప్రసాద్